మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
PRGI REGD NO: TGTEL/25/A1385
Circulated to Telangana
Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 26-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు:12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 | సంచిక: 88 Issue: 88

26 సెప్టెంబర్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:05 తిథి పౌర్ణమి రా. 10:14 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వాభాద్ర ఉ. 11:20 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం గండ మ. 1:10 వరకు కరణం విష్టి ఉ. 10:44 వరకు బవ రా. 10:14 వరకు వర్జ్యం రా. 8:58 నుండి రా. 10:32 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:32 వరకు రాహుకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:37 వరకు యమగండం మ. 1:37 నుండి మ. 3:06 వరకు గుళికాకాలం ఉ. 6:09 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు లేదు అభిజిత్ ముహూర్తం ఉ. 11:43 నుండి మ. 12:31 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## బై బై గణేశా!!

## వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో

# త్వరలో ఓపీ సేవలు!

### నవంబరులో సీఎం చేతులమీదుగా ఆస్పత్రి ప్రారంభోత్సవం



వరంగల్‌లో కొత్తగా నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో ఔట్‌పేషెంట్ (ఓపీ) సేవలను తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి విక్షసరాజ్ అధికారులను ఆదేశించారు. వరంగల్ ఎంజీఎంలో ఇటీవల జరిగిన ఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం సందర్శించిన సీఎంవో అధికారులు.. ఆస్పత్రి భవన నిర్మా ణ పనులను పరిశీలించారు. ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా, నీటి వసతి, ఇతర ప్రాథమిక సౌకర్యాలను పరిశీలించారు. - వరంగల్ మెడికల్, సెప్టెంబరు 25 :

అనంతరం సీఎంఓ కార్యదర్శి కె.మాణిక్య రాజ్, ప్రణాళికా, ఆర్థికశాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌తో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి నవంబరులో ప్రారంభిస్తారని సీఎంవో అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. కాగా, ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలించిన అనంతరం సీఎంవో అధికారులు స్థానిక (మిగతా 2వ పేజీలో)



## దావుద్ భద్రతపై ఐఎస్ఐ ప్రత్యేక దృష్టి

### కరాచీ పోర్టు సమీపానికి నివాసం మార్పు

### భారత్ చర్యల భయంతో అప్రమత్తమైన పాక్

### డీ-కంపెనీలో వారసత్వ పోరు తీవ్రం

కరాచీ, సెప్టెంబర్ 25 :

అంతర్జాతీయ ఉగ్రవాది, అండర్‌వరల్డ్ డాన్ దావుద్ ఇబ్రహీం విషయంలో పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ తన వ్యూహాన్ని మార్చుకున్నట్లు నిఘా వర్గాల సమాచారం వెల్లడిస్తోంది. గతంలో దావుద్ (మిగతా 2వ పేజీలో)



# ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### ఆర్యదాన్ ముహమ్మద్-2026 అవార్డు అందుకున్న సీఎం

### నిలంబూర్‌లో ఘనంగా సత్కారం

### కేరళ వెలుపల నుంచి ఎంపికైన తొలి వ్యక్తిగా గుర్తింపు

నిలంబూర్ (కేరళ), సెప్టెంబర్ 25 :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్-2026' అవార్డును అందుకున్నారు. కేరళ రాష్ట్రంలోని నిలంబూర్‌లో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ కే.సి. వేణుగోపాల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి ఈ అవార్డును స్వీకరించారు. ప్రజా సేవా రంగంలో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు.

అవార్డు స్వీకరణ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆర్యదాన్ ముహమ్మద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కేరళ రాష్ట్రం వెలుపల నుంచి ఈ అవార్డుకు ఎంపికైన తొలి వ్యక్తిగా నిలవడం మరింత ఆనందాన్ని కలిగించిందన్నారు. కేరళతో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేరళకు వచ్చిన ప్రతిసారీ అక్కడి ప్రజలు ఎంతో ఆత్మీయంగా స్వాగతం పలికారని చెప్పారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా, అలాగే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా కేరళను సందర్శించిన విషయాన్ని ప్రస్తావించారు. (మిగతా 2వ పేజీలో)



# సీఐఎస్ఎఫ్ సంక్షేమానికి ఐహెచ్‌బీఏఎస్‌తో ఒప్పందం

### మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణకు ప్రాధాన్యం

### మూడేళ్ల పాటు సంయుక్త కార్యక్రమాలు

కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది సమగ్ర సంక్షేమాన్ని బలోపేతం చేసే దిశగా సీఐఎస్ఎఫ్ మరియు మానవ ప్రవర్తన, అనుబంధ శాస్త్రాల సంస్థ (ఐహెచ్‌బీఏఎస్) మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. న్యూఢిల్లీలోని సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయంలో ఈ ఒప్పందంపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. సిబ్బంది మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, సామర్థ్య వృద్ధి వంటి అంశాలకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది. మూడేళ్లపాటు అమలులో ఉండనున్న ఈ ఒప్పందం ద్వారా సీఐఎస్ఎఫ్ సిబ్బందికి వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మానసిక స్థితి అంచనా పరీక్షలు, వ్యక్తిత్వ విశ్లేషణలు, కౌన్సెలింగ్ సేవలు, మానసిక అత్యవసర పరిస్థితుల్లో సహాయం వంటి సేవలను అందించనున్నారు. - న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 :

అవసరమైన వారికి వైద్య చికిత్సతో పాటు వ్యసన విముక్తి చికిత్సలు కూడా అందుబాటులో ఉంచనున్నారు. సిబ్బందిలో ఒత్తిడి, అసాధారణ ప్రవర్తన, హెచ్చరిక సంకేతాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన (మిగతా 2వ పేజీలో)



## కాలిన గుడిసెలను పరిశీలించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

### బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ నేత

### వడ్డెర బస్తీ సమస్యల పరిష్కారానికి చర్యలు కోరిన మాజీ మంత్రి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25 :

మహబూబ్‌నగర్ పట్టణంలోని మోతీనగర్ వడ్డెర బస్తీలో అగ్నిప్రమాదానికి గురై కాలిపోయిన గుడిసెలను మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విని తక్షణ సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల గుడిసెలను ఎవరూ తొలగించలేరని (మిగతా 2వ పేజీలో)

## కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్య పరిరక్షణ..

# లేదంటే విఘాతమా?



## కిషన్ రెడ్డి ఫైర్

తెలంగాణ బ్యూరో :

ప్రధానమంత్రి, హోంమంత్రిని లోక్‌సభలో ప్రతిపక్ష నేత 'దేశద్రోహి' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కోట్లాది మంది నమ్మకంతో ఓటేసి గెలిపించిన వారిపై రాహుల్ గాంధీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం.. ఆయన మానసిక స్థితిని, అసహనాన్ని (మిగతా 2వ పేజీలో)

## రాశి ఫలాలు

26.9.2026

**మేషం:** మిత్రులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడతాయి. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తప్పవు. సంతాన ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

**వృషభం:** చేపట్టిన పనులు శ్రమతో గాని పూర్తి కావు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ప్రత్యర్థుల నుంచి ఊహించని సమస్యలు కలుగుతాయి. వ్యాపార ఉద్యోగాలు సాదాసీదాగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో  తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. చేపట్టిన పనులు సజావుగా పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** వ్యాపార, ఉద్యోగాల్లో ఊహించని మార్పులు ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఋణదాతల నుంచి ఒత్తిడి అధికమవుతుంది. బంధువులతో విభేదాలు మానసికంగా చికాకు పరుస్తాయి.

**సింహం:** చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారమవుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

**కన్య:** పనులు కొన్ని వాయిదా పడుతాయి. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో అధిక శ్రమతో అల్ప ఫలితాన్ని పొందుతారు. స్థిరాస్తి వివాదాలలో శిరో బాధలు తప్పవు.

**తుల:** వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. రాజకీయ సంబంధిత సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి.

**వృశ్చికం:** నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కష్టసుఖాలను పంచుకుంటారు. ఉద్యోగాల్లో పదోన్నతులు పెరుగుతాయి.

**ధనస్సు:** సోదరులతో స్వల్ప వివాదాలు తప్పవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగులకు అదనపు పనిభారం ఉంటుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. కొన్ని వ్యవహారాలు శ్రమతో గాని పూర్తి కావు.

**మకరం:** ఉద్యోగులకు పని ఒత్తిడులు అధికమవుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. పనుల్లో ఆటంకాలు తప్పవు. భాగస్వామ్య వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

**కుంభం:** నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. ముఖ్యమైన కార్యక్రమాల్లో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. అవసరానికి సన్నిహితుల సహాయం పొందుతారు. జీవిత భాగస్వామితో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**మీనం:** దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. విందు వినోద  కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. వ్యాపార  విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి.



## కాలిన గుడిసెలను పరిశీలించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెట్ల కింద జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు గుడిసెలు వేసుకునేందుకు స్థలాలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం నివాస సౌకర్యాలు లేని పేద కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి గృహ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు ఇళ్ల నిర్మాణంలో సహకరించాలని ఆయన అన్నారు. నిరుపేదల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ముందుండాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సదుపాయం కల్పించాలని సూచించారు. పేదల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు అవసరమని పేర్కొన్నారు. అగ్నిప్రమాదంలో గుడిసెలను కోల్పోయిన కుటుంబాలకు తాను వ్యక్తిగతంగా సహాయం అందిస్తానని శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. తన సొంత ఖర్చులతో రేకులు ఏర్పాటు చేసి తాత్కాలిక నివాస సౌకర్యం కల్పిస్తానని తెలిపారు. బాధిత కుటుంబాలు తిరిగి సాధారణ జీవితం ప్రారంభించేందుకు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే స్థానిక బీఆర్ఎస్ కార్పొరేటర్లు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. బాధితులకు ఆహారం, తాగునీరు, అవసరమైన వస్తువులు అందించేందుకు పార్టీ నాయకులు ముందుకు వచ్చారని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం చేయడం సామాజిక బాధ్యత అని అన్నారు. వడ్డెర బస్తీలో లైటింగ్ సదుపాయం, మౌలిక వసతులు, ఇతర స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరాలని స్థానిక కార్పొరేటర్లకు సూచించారు. బస్తీ ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించే దిశగా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కొత్తగా 200 కోర్టులు

హైదరాబాద్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో కొత్తగా 200 జూనియర్ సివిల్ కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. న్యాయస్థానాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు ఇప్పటికే ఉన్న కోర్టులపై భారాన్ని తగ్గించేందుకు 33 జిల్లాల్లో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కమ్ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులను మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజానికి రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 594 అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కమ్ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులను, ఆ కోర్టుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, మౌలిక వసతులను మంజూరు చేయాలని రాష్ట్ర హైకోర్టు గత ఏడాది డిసెంబర్ 29న ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 200 జూనియర్ సివిల్ కోర్టుల్లో 71 అంటే దాదాపు మూడో వంతు కోర్టులు గ్రేటర్ హైదరాబాద్, సమీపంలోని మూడు జిల్లాలోనే ఉండటం గమనార్హం. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 30, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 25, హైదరాబాద్ జిల్లాలో 16 కోర్టులు ఏర్పాటు కానున్నా యి. ఇక నల్లగొండ జిల్లాకు 10, సంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు 8 చొప్పున, హనుమకొండ, కరీంనగర్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు 7 చొప్పున, నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు 6 చొప్పున, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు 5 చొప్పున, రాజన్న సిరిసిల్ల జిల్లాకు 4, జనగామ, కామారెడ్డి, మహబూబాబా ద్, మెదక్, నాగర్ కర్నూల్, వికారాబాద్, వనపర్తి జిల్లాలకు 3 చొప్పున, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణపేట, నిర్మల్ జిల్లాలకు 2 చొప్పున, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు జిల్లాలకు ఒక్కొక్కటి చొప్పున జూనియర్ సివిల్ కోర్టులు మంజూరు అయ్యాయి.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

కేరళ ప్రజలు లౌకిక విలువలకు కట్టుబడి ఉండటం దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడని ముఖ్యమంత్రి కొనియాడారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించారని, పలువురు ముఖ్యమంత్రుల మంత్రివర్గాల్లో నాలుగుసార్లు మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. కేరళ రాజకీయాల్లో ఆయన వ్యూహాత్మక నాయకత్వంతో ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు.



ఆర్యదాన్ ముహమ్మద్ కాంగ్రెస్ పార్టీకి కేరళలో ఒక మహావృక్షంలా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని చెప్పారు. ఆయన స్ఫూర్తిని అనుసరిస్తూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ చైర్మన్ ఆర్యదాన్ షౌకత్, కేరళకు చెందిన పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, సామాజిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం ఘనంగా నిర్వహించబడగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ అవార్డు ప్రజా సేవా రంగంలో ఆయనకు లభించిన మరో ముఖ్యమైన గుర్తింపుగా నిలిచింది.

## కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్య పరిరక్షణ.. లేదంటే విఘాతమా?

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేస్తోందన్నారు. ఒక పార్టీ జెండాతో గెలిచి వేరే పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై సుప్రీంకోర్టు అనర్హత వేటు వేయడాన్ని స్వాగతించి, క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. అదేరోజు ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. దానం నాగేందర్ ఒక పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతుండగానే, రాహుల్ గాంధీ ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించారని తెలిపారు. ఇదే అసలైన 'ఓట్ చోరీ' అంటే అని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఛీత్కరించినప్పుడల్లా ఏం చేయాలో పాలుపోక రాజ్యాంగబద్ధ సంస్థలపై అసహనాన్ని వెల్లగక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిన్న సుప్రీంకోర్టు.. ఇవాళ ఎన్నికల కమిషన్.. రేపు మరో సంస్థ.. ఇలా కాంగ్రెస్ ప్రతి సంస్థపై తన అక్కసు వెల్లగక్కుతూనే ఉంటుంది. నిజంగానే విచారణ సంస్థలను



దుర్వినియోగం చేస్తే.. 'నేషనల్ హెరాల్డ్' కేసులో రాహుల్ గాంధీ బెయిల్‌పై బయట ఎందుకు తిరుగుతున్నారో ఓసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి. కాంగ్రెస్.. సుప్రీం కోర్టును నమ్మదు.. ఎన్నికల కమిషన్‌పై నమ్మకం ఉంచదు.. ఈవీఎంపై అనుమానాలు వ్యక్తం చేస్తుంటుంది. చివరకు మన దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే సాయుధ బలగాలను కూడా విశ్వసించదు. రాహుల్ గాంధీ ఎవరిని నమ్ముతారు? ఎస్ఐఆర్ నిర్వహించిన చోట 'ఓట్ చోరీ' ద్వారా బీజేపీ గెలిచిందంటూ రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. తమిళనాడు, కేరళలో కూడా ఎస్ఐఆర్ నిర్వహించారు. అక్కడ బీజేపీ గెలవలేదు కదా. పశ్చిమ బెంగాల్‌లో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించిన 20 నియోజకవర్గాల్లో టీఎంసీ 13 స్థానాల్లో గెలిచింది. ఎస్ఐఆర్ బెంగాల్‌లో కుట్ర అయితే.. కేరళలో ఎందుకు మీకు వరంగా కనిపిస్తోంది? కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కేరళలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా మోసం చేసే గెలిచాయని అనుకుంటున్నారా? కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం గెలిచినట్టు.. వేరే పార్టీలు గెలిస్తే అది ప్రజాస్వామ్యానికి విఘాతమా?' అని కిషన్ రెడ్డి నిలదీశారు. మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్లను ఎం.ఎస్ గిల్, టీ.ఎన్ శేషన్‌ను ఎంపీలు, కేంద్రమంత్రులను చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అని కిషన్ రెడ్డి గుర్తు చేశారు.

## ...ఆస్పత్రిలో  త్వరలో ఓపీ సేవలు!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబరులో నూతన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 18 అంతస్తులను సిద్ధం చేయాలన్నారు. ఆస్పత్రిని ప్రతి రోజు సందర్శించి నిర్మాణ పనులను పర్యవేక్షించాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంజీఎం ఆస్పత్రి, ప్రభుత్వ సీకేఎం ప్రసూతి ఆస్పత్రి, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, వరంగల్ ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్లు, కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ) ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## సీఐఎస్ఎఫ్ సంక్షేమానికి ఐహెచ్‌బీపీఎస్‌తో ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

నైపుణ్యాలను అందించనున్నారు. ఉద్యోగ సంబంధిత సవాళ్లను అధిగమించేందుకు మానసికంగా బలంగా ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా సీఐఎస్ఎఫ్ వైద్య అధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఉపాధికారులు, ప్రధాన శిక్షకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం, తగిన సహాయం అందించడం వంటి అంశాల్లో వారి సామర్థ్యాలను పెంపొందించనున్నారు. సంస్థలో ఆరోగ్యకరమైన పని వాతావరణం నెలకొల్పడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందించనున్నారు. సిబ్బందికి నిరంతర మానసిక ఆరోగ్య సహాయం అందించేందుకు టెలి-మనస్ అత్యవసర సేవలను కూడా అనుసంధానం చేయనున్నారు. 24 గంటలూ అందుబాటులో ఉండే ఈ సేవల ద్వారా సలహాలు, మార్గదర్శకత పొందే అవకాశం కల్పించనున్నారు. అవసరమైన సమయంలో వెంటనే నిపుణుల సహాయం అందేలా చర్యలు తీసుకోనున్నారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా ప్రాధాన్యంతో చూడాలనే లక్ష్యంతో ఈ ఒప్పందం కుదిరిందని అధికారులు తెలిపారు. ఆధునిక కాలంలో పెరుగుతున్న ఒత్తిడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది సంక్షేమానికి సమగ్ర చర్యలు చేపట్టడం అవసరమని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా సిబ్బంది పనితీరు, వ్యక్తిగత శ్రేయస్సు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## దావుద్ భద్రతపై ఐఎస్ఐ ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

నెట్‌వర్క్‌ను వివిధ కార్యకలాపాలకు వినియోగించుకున్న ఐఎస్ఐ, ప్రస్తుతం అతడి భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. దావుద్‌పై భారత్ ఏదైనా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. దావుద్ నివాసాన్ని కరాచీ పోర్టుకు సమీపంలోని అత్యంత భద్రమైన ప్రాంతానికి మార్చినట్లు నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. సముద్ర మార్గం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వేగంగా తరలించే అవకాశాలు ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. ఒకవేళ భద్రతా ముప్పు ఏర్పడితే తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసినట్లు సమాచారం. గత ఏడాది జరిగిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత దావుద్ భద్రత అంశాన్ని ఐఎస్ఐ అత్యంత సున్నితంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. దావుద్ భారత ఆపరేషన్‌లో మరణిస్తే, ఇన్నాళ్లుగా అతడు తమ దేశంలో లేడని చెబుతున్న పాకిస్థాన్ వాదన అంతర్జాతీయ వేదికలపై ప్రశ్నార్థకంగా మారుతుందనే ఆందోళన పాక్ అధికార వర్గాల్లో ఉన్నట్లు నిఘా సమాచారం సూచిస్తోంది. ఈ నేపథ్యంలో అతడి కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. దావుద్ ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ కరాచీలోనే ఉన్నట్లు నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్ర సంస్థలకు నిధుల సమీకరణలో దావుద్ నెట్‌వర్క్ కీలక పాత్ర పోషిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం నెట్‌వర్క్ విస్తరణ కంటే దావుద్ ఆరోగ్యం, భద్రత అంశాలపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకృతమైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా డీ-కంపెనీలో అంతర్గత విభేదాలు కూడా తలెత్తినట్లు తెలుస్తోంది. దావుద్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో సంస్థ భవిష్యత్ నాయకత్వంపై చర్చలు ప్రారంభమయ్యాయి. అతడి సోదరుడు అనీస్ ఇబ్రహీం, సన్నిహిత అనుచరుడు ఛోటా షకీల్ మధ్య ఆధిపత్య పోరు నెలకొన్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో సంస్థలో నిర్ణయాల అమలు, కార్యకలాపాల నిర్వహణపై ప్రభావం పడుతున్నట్లు చెబుతున్నారు. మరోవైపు భారత్ మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడం, డీ-కంపెనీకి చెందిన కీలక అనుచరులపై చర్యలు తీసుకోవడం వల్ల సంస్థ కార్యకలాపాలు దెబ్బతిన్నట్లు సమాచారం. ఎఫ్ఏటీఎఫ్ నిఘా, అంతర్జాతీయ ఒత్తిడి, అంతర్గత విభేదాలు కలిసి పాకిస్థాన్‌కు తలనొప్పిగా మారినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దావుద్ నెట్‌వర్క్ బలహీనపడటం భారత భద్రతా సంస్థలకు సానుకూల పరిణామంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

నేటి ఈవార్తలు

## సంపాదకీయం

# పెరుగుతున్న ఒత్తిడి జీవనం.. మానసిక ఆరోగ్యంపై ప్రభావం

ఆధునిక ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతిక అభివృద్ధి, పోటీ వాతావరణం, ఆర్థిక అవసరాలు, సామాజిక ఒత్తిళ్లు కలిసి మనిషి జీవితాన్ని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ఒకప్పుడు కుటుంబం, సమాజం, ప్రకృతితో మమేకమై జీవించిన మనిషి నేడు సమయంతో పోటీ పడుతూ జీవించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. ఈ మార్పులు జీవన ప్రమాణాలను మెరుగుపరిచినప్పటికీ, మరోవైపు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. నేటి కాలంలో శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని గుర్తించాల్సిన అవసరం ఏర్పడింది.

ఉద్యోగాలు, విద్య, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలు వంటి అనేక అంశాలు వ్యక్తులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. మెరుగైన జీవితాన్ని సాధించాలనే ఆశతో ప్రజలు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, విశ్రాంతి తీసుకోవడానికి సమయం కేటాయించలేకపోతున్నారు. ఫలితంగా ఆందోళన, నిరాశ, నిద్రలేమి, చిరాకు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఈ సమస్యలు తీవ్రమై వ్యక్తిగత జీవితం, కుటుంబ సంబంధాలు, ఉద్యోగ పనితీరుపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ఒత్తిడి అనేది కేవలం భావోద్వేగ సమస్య మాత్రమే కాకుండా ఆరోగ్య సమస్యగా కూడా మారుతోంది. ప్రస్తుత కాలంలో యువత ఎక్కువగా మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న వర్గంగా కనిపిస్తోంది. విద్యా పోటీ, ఉద్యోగ అవకాశాల కోసం పోరాటం, భవిష్యత్తుపై అనిశ్చితి వంటి అంశాలు యువతను ప్రభావితం చేస్తున్నాయి. సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా దీనికి తోడవుతోంది. ఇతరుల విజయాలను నిరంతరం చూస్తూ తమ జీవితాన్ని పోల్చుకోవడం వల్ల అనేక మంది ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. వాస్తవ జీవితానికి, అంతర్జాల ప్రపంచానికి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు పెరగడం, కుటుంబ సభ్యుల మధ్య గడిపే సమయం తగ్గిపోవడం, భావోద్వేగ మద్దతు లోపించడం వంటి అంశాలు ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి. గతంలో సమస్యలను కుటుంబ సభ్యులతో పంచుకునే అవకాశం ఉండేది. కానీ నేడు అనేక మంది తమ సమస్యలను తమలో తామే దాచుకుని బాధపడుతున్నారు. ఈ పరిస్థితి ఒంటరితనం, నిరాశ వంటి సమస్యలకు దారితీస్తోంది.

మానసిక ఆరోగ్య సమస్యలను ఇప్పటికీ సమాజంలో చాలామంది సరైన దృక్పథంతో చూడడం లేదు. శారీరక అనారోగ్యానికి వైద్య సహాయం తీసుకున్నట్లే మానసిక సమస్యలకు కూడా నిపుణుల సహాయం అవసరమనే అవగాహన ఇంకా పూర్తిగా ఏర్పడలేదు. కొందరు మానసిక ఆరోగ్య సమస్యలను బలహీనతగా భావించడం వల్ల అవసరమైన చికిత్స తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఈ అపోహలు తొలగించాల్సిన అవసరం ఉంది. మానసిక ఆరోగ్య సమస్యలు కూడా ఇతర ఆరోగ్య సమస్యల్లాగే చికిత్సతో నియంత్రించగలవని సమాజం గుర్తించాలి.

ఒత్తిడి ప్రభావం మానసిక స్థితికే పరిమితం కాదు. ఇది శారీరక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, జీర్ణకోశ సమస్యలు, నిద్రలేమి, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దీర్ఘకాలిక ఒత్తిడి కారణమవుతుంది. అందువల్ల ఒత్తిడిని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం అవసరం. ఆరోగ్యకర జీవనశైలి దీనికి ఒక ముఖ్యమైన పరిష్కారంగా నిలుస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగ, ధ్యానం, వ్యాయామం, ప్రకృతితో గడపడం, కుటుంబ సభ్యులతో సమయం గడపడం వంటి అలవాట్లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ కొంత సమయం శారీరక వ్యాయామానికి కేటాయించడం వల్ల ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే తగిన నిద్ర, సమతుల్య ఆహారం, సానుకూల ఆలోచనలు కూడా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చిన్న చిన్న మార్పులు కూడా జీవితంలో పెద్ద మార్పులను తీసుకురాగలవు. విద్యాసంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వాలు కూడా మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు, ఉద్యోగులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అవసరమైన సలహా సేవలు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు ఉపయోగపడతాయి. ఒత్తిడిని ఎదుర్కొనే నైపుణ్యాలను చిన్నప్పటి నుంచే నేర్పించడం ద్వారా భవిష్యత్తులో మానసిక ఆరోగ్య సమస్యలను తగ్గించే అవకాశం ఉంటుంది. సాంకేతికత మన జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, దాని అధిక వినియోగం కూడా ఒత్తిడికి కారణమవుతోంది. నిరంతరం అంతర్జాలంలో గడపడం, విశ్రాంతి లేకుండా సమాచార ప్రవాహంలో మునిగిపోవడం, పనిని ఇంటికీ తీసుకురావడం వంటి అలవాట్లు మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయి. అందువల్ల సాంకేతిక వినియోగంలో కూడా సమతుల్యత అవసరం. పని, విశ్రాంతి, కుటుంబం, వ్యక్తిగత అభిరుచుల మధ్య సమన్వయం ఉండాలి. పెరుగుతున్న ఒత్తిడి జీవనం ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి. అభివృద్ధి, పోటీ, విజయాల కోసం పరిగెత్తే క్రమంలో మానసిక ఆరోగ్యాన్ని విస్మరిస్తే దాని మూల్యం చాలా భారీగా చెల్లించాల్సి వస్తుంది. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరం. ఒత్తిడిని గుర్తించడం, దానిని సమర్థంగా ఎదుర్కోవడం, అవసరమైనప్పుడు సహాయం కోరడం, సమతుల్య జీవన విధానాన్ని అవలంబించడం ద్వారా మాత్రమే మానసికంగా బలమైన, సంతోషకరమైన సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుంది.

# ఫార్మసిస్టుల వ్యవస్థ బలోపేతం కావాలి

### లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి



**కరీంనగర్, సెప్టెంబర్ 25 :** ప్రజారోగ్య వ్యవస్థను మరింత పటిష్టం చేయాలంటే ఫార్మసిస్టుల సేవలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ వారి వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కరీంనగర్‌కు చెందిన ఫార్మసిస్టులు లయన్ నడిపెల్లి ప్రసాద్ రావు, లయన్ జె.సి. ప్రకాశ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రోగులకు, వైద్యులకు మధ్య కీలక అనుసంధానకర్తలుగా ఫార్మసిస్టులు బాధ్యతాయుతమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఔషధాల వినియోగంపై రోగులకు అవగాహన కల్పించడం, సరైన మందులు అందేలా చూడటం వంటి అంశాల్లో వారి పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఫార్మసిస్టుల సేవలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, భారతదేశంలోనూ వారికి తగిన ప్రాధాన్యం, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సన్మాన గ్రహీత లయన్ నడిపెల్లి ప్రసాద్ రావు మాట్లాడుతూ ఔషధాల తయారీ నుంచి వాటి పంపిణీ, వినియోగం వరకు ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో అనేక విధాలుగా సేవలందిస్తున్న ఫార్మసిస్టులను గుర్తించి సత్కరించిన శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ ఎం. సత్యనారాయణ రావు, లయన్ డి. తిరుపతి రెడ్డి, లయన్ కోట సత్యం, లయన్ పి. సురేందర్, లయన్ రఘునందన్ రావు తదితరులు పాల్గొని ఫార్మసిస్టులను అభినందించారు.

# పని భారం తగ్గించాలని ఎస్‌జీటీ ఉపాధ్యాయుల నిరసన




**చిలుకూరు, సెప్టెంబర్ 25 :** ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని కోరుతూ చిలుకూరు మండల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. మండల కాంప్లెక్స్ సమావేశం సందర్భంగా భోజన విరామ సమయంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ సమస్యలను తెలియజేశారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన ఉపాధ్యాయులను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు వివిధ రకాల బోధనేతర విధులు అప్పగించడం వల్ల విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. బోధనేతర పనుల భారాన్ని తగ్గించి, ఉపాధ్యాయులు విద్యాబోధనపై పూర్తిగా దృష్టి సారించేలా అనుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని కోరారు. ప్రాథమిక విద్య బలోపేతానికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు.

# లక్ష పోస్టు కార్డుల సమీకరణలో జోరు

### రెండు హాస్టళ్లలో 300 పోస్టు కార్డులు పూర్తి

### రైల్వే సాధన ఉద్యమానికి విద్యార్థుల మద్దతు



**సూర్యాపేట, సెప్టెంబర్ 25 :** సూర్యాపేటకు సాధారణ రైల్వే మార్గం సాధించాలనే డిమాండ్‌తో రైల్వే సాధన సమితి చేపట్టిన 'లక్ష పోస్టు కార్డుల సమీకరణ' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని రెండు హాస్టళ్లను రైల్వే సాధన సమితి నాయకులు సందర్శించి విద్యార్థులకు రైల్వే సాధన ఉద్యమ లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సుమారు 300 పోస్టు కార్డులను పూర్తి చేయించారు. సూర్యాపేట ప్రాంతానికి రైల్వే సదుపాయం ఏర్పడితే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, సామాన్య ప్రజలకు కలిగే ప్రయోజనాలను నాయకులు వివరించారు. రైల్వే కనెక్టివిటీ లేకపోవడం వల్ల జిల్లా కేంద్ర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్ సంక్షేమ అధికారిణి మెహబూబా అనుమతితో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సూర్యాపేటకు సాధారణ రైలు రావాలనే డిమాండ్‌కు తమ మద్దతు ప్రకటిస్తూ పోస్టు కార్డులను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, జేఏసీ చైర్మన్ చింతలపాటి చిన్న శ్రీరాములు, కో-కన్వీనర్ రాచూరి ప్రతాప్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట రైల్వే పోరాటానికి బహుజన కమ్యూనిస్టు పార్టీ మద్దతు

### సామాన్యుడి రైలు కోసం జరుగుతున్న ఉద్యమాన్ని బలోపేతం చేయాలి: కే. పర్వతాలు



**సూర్యాపేట, సెప్టెంబర్ 25 :** సూర్యాపేటకు సాధారణ రైల్వే మార్గం సాధించేందుకు రైల్వే సాధన సమితి చేస్తున్న కృషికి బహుజన కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం పార్టీ రాష్ట్ర నాయకులు కే. పర్వతాలు రైల్వే సాధన సమితి నాయకులతో కలిసి మాట్లాడుతూ, సూర్యాపేట వంటి ప్రధాన వాణిజ్య, విద్యా, వైద్య కేంద్రానికి రైల్వే అనుసంధానం తప్పనిసరిగా అవసరమని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న సూర్యాపేటకు ఇప్పటికీ ప్రత్యక్ష రైల్వే సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో సాధారణ రైలు కోసం రైల్వే సాధన సమితి చేస్తున్న ఉద్యమం ప్రజల అవసరాలతో ముడిపడినదని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే సాధారణ రైలు కోసం జరుగుతున్న ఈ పోరాటాన్ని అన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలని పర్వతాలు కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సూర్యాపేటకు రైల్వే మార్గం సాధించే ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సూర్యాపేటకు రైల్వే సాధన కోసం చేపట్టే భవిష్యత్ కార్యక్రమాలకు తమ పార్టీ తరఫున సహకారం అందిస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి నాయకులు రాచూరి ప్రతాప్, వెంకట్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్

**జగిత్యాల, సెప్టెంబర్ 25 :**

భీమారం మండలంలోని రాజలింగంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం, భీమారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులు ప్రజలకు ఉపయోగపడే విధంగా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల వేగం మరియు నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడంలో పంచాయతీ భవనం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. భవనం నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం భీమారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలు అత్యంత ముఖ్యమని కలెక్టర్ అన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత కేంద్రం అన్ని వసతులతో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిల్లలకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా భవనం నిర్మాణం ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.




# ప్రతిభకు శ్రీరామ్ చేయూత

**ప్రతిభావంతులకు ఆర్థిక ప్రోత్సాహం**

**రూ.5 లక్షలు అందుకున్న వర్షిత, రూ.3 లక్షలు పొందిన మౌనిక**

**గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ప్రదానం**

**ఉన్నత లక్ష్యాలతో కృషి చేయాలి గవర్నర్**

**ప్రత్యేక కార్యక్రమంలో పలువురు ప్రముఖుల హాజరు**

**సంగారెడ్డి ప్రతినిధి, 25 సెప్టెంబర్, రుద్ర న్యూస్:**

సంగారెడ్డి: పేదరికాన్ని జయించి విద్యలో ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, మల్కాపూర్, కొండాపూర్ మండలంకు చెందిన విద్యార్థిని ఎ. వర్షితకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందించింది. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 10వ తరగతి పరీక్షలో 594 మార్కులు సాధించి ఆమె విశేష ప్రతిభ కనబరిచింది. ఆమెతో పాటు మరో విద్యార్థిని కె. మౌనిక 592 మార్కులు సాధించగా, రూ.3 లక్షల ప్రోత్సాహకాన్ని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తరఫున ఈ నగదు ప్రోత్సాహకాలను గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అందజేశారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కష్టపడి చదివి విజయం సాధించిన విద్యార్థులను శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో మరింత కృషి చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ క్యాషి, శ్రీరామ్ ఫైనాన్స్ ఎండి ప్రవీణ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఇండియా మార్కెటింగ్ మేనేజర్ వరుణ్ కిషోర్, శ్రీరామ్ లైఫ్ తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, హైదరాబాద్ జోనల్ మేనేజర్ నరేందర్, సంగారెడ్డి డివిజన్ ఏజీఎం విజయ్, బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్, స్థానిక మల్కాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపసర్పంచ్ ప్రవీణ్ పాల్గొన్నారు.



# కొబ్బరి నీరు తాగడానికి సరైన సమయం ఏది?

**డెస్క్, సెప్టెంబర్ 25 :**

కొబ్బరి నీరు సహజంగా లభించే ప్రసిద్ధ పానీయాల్లో ఒకటి. తేలికైన రుచి, తాజాదనంతో పాటు దాహం తీర్చడంలో ఉపయోగపడటంతో అనేక మంది దీనిని ఇష్టపడుతుంటారు. అయితే కొబ్బరి నీరు తాగడానికి సరైన సమయం ఏదనే సందేహం చాలామందిలో ఉంటుంది. ఉదయం అల్పాహారానికి ముందు లేదా తర్వాత కొబ్బరి నీరు తాగడం చాలామంది అలవాటుగా చేసుకుంటారు. రాత్రి నిద్ర తర్వాత శరీరానికి ద్రవాలు అందించడంలో ఇది సహాయపడవచ్చని భావిస్తారు. ముఖ్యంగా వేడి వాతావరణంలో ఉదయం కొబ్బరి నీరు తాగితే తాజాగా అనిపించవచ్చు. వ్యాయామం, నడక లేదా ఇతర శారీరక శ్రమ తర్వాత కూడా కొబ్బరి నీటిని తీసుకుంటారు.

# యంగ్ ఇండియా పాఠశాల స్థల సర్వే పరిశీలన

**ఇల్లెందు, సెప్టెంబర్ 25 :**



ఇల్లెందు నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నంబర్ 549/1లో పాఠశాల నిర్మాణం కోసం ప్రతిపాదించిన 20 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పనుల పురోగతిని సమీక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ వివరాలు, పాత నక్షాలు, పాస్‌బుక్‌లు, భూ భారతి రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. భూమికి సంబంధించిన అన్ని పత్రాలను సమగ్రంగా పరిశీలించి క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చాలని అధికారులను ఆదేశించారు. భూమి యాజమాన్యం, సరిహద్దుల విషయంలో ఎలాంటి సందిగ్ధత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక రైతులు తమ వద్ద ఉన్న పాత పాస్‌బుక్‌లు, ఇతర భూ సంబంధిత పత్రాలను కలెక్టర్‌కు చూపించారు. భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని వారు కోరారు. రైతుల నుంచి అందిన వివరాలను పరిశీలించిన కలెక్టర్, అధికారుల వద్ద ఉన్న రికార్డులతో వాటిని సరిపోల్చి వాస్తవ పరిస్థితులను గుర్తించాలని సూచించారు. రైతుల అభ్యంతరాలు, అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నంబర్ 549/1లో అన్ని శాఖల సమన్వయంతో సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రికార్డుల ఆధారంగా ఖచ్చితమైన సరిహద్దులను గుర్తించి, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నివేదిక రూపొందించాలని రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ప్రాంతీయ విద్యాభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు. అందుకు అవసరమైన భూమి గుర్తింపు, సరిహద్దుల నిర్ధారణ వంటి ప్రక్రియలను వేగంగా పూర్తి చేయడం ద్వారా నిర్మాణ పనులకు మార్గం సుగమం కానుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుగా దీనిని భావించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఇల్లెందు తహసీల్దార్ ఖాసిం, ఏడీ సర్వే శ్రీనివాస్, ఇల్లెందు మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే పనులను పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలానికి సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు.

# వెంకటాపూర్‌లో డిజిటల్ రీ-సర్వే పరిశీలన

**నారాయణపేట, సెప్టెంబర్ 25 :**



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రీ-సర్వే ప్రక్రియను నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల ఆధునీకరణ, భూ హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'భూ భారతి' పోర్టల్ ద్వారా సర్వే మ్యాప్‌లతో పాటు ప్రత్యేక భూధార్ నంబర్ ఆధారంగా శాశ్వత భూ హక్కుల నమోదు ప్రక్రియను ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. భూ రికార్డులను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేసి రైతులకు పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూముల యాజమాన్య వివరాలను స్పష్టంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో వివాదాలను తగ్గించే అవకాశం ఉంటుందని చెప్పారు. మొదటి విడతలో వెంకటాపూర్ రెవెన్యూ గ్రామంలోని 45 సర్వే నంబర్ల పరిధిలో 646.39 ఎకరాల్లో రీ-సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రైతులు ప్రస్తుతం అనుభవిస్తున్న భూమి విస్తీర్ణాన్ని ఆధారంగా చేసుకుని సమగ్ర సర్వే చేపడతామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఖచ్చితమైన భూ సర్వే నిర్వహించి రికార్డులను నవీకరించనున్నట్లు పేర్కొన్నారు. రీ-సర్వే ప్రక్రియలో భాగంగా ముందుగా గ్రామ మొత్తం సరిహద్దులను గుర్తించి, అనంతరం గ్రామకంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, ప్రభుత్వ భూముల్లో రైతుల ఆక్రమణ స్థితి, తదనంతరం పట్టా భూముల సర్వే చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించి ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రక్రియ ప్రారంభానికి ముందు గ్రామసభ నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం గ్రామంలో టామ్‌టామ్ ద్వారా సమాచారం అందించి, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రీ-సర్వే నిర్వహిస్తామని చెప్పారు. భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలను రైతులు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. రైతులు, భూ యజమానులు అధికారులకు పూర్తి వివరాలు అందించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్, సర్వేయర్ జయశంకర్, ఇతర సర్వేయర్లు, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థి ఉన్నత విద్యకు కలెక్టర్ ఆర్థిక సహాయం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 :**



ఆర్థిక ఇబ్బందులు ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారకూడదనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విద్యారంగంలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు అవసరమైన సహాయం అందించేందుకు జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. సిరికొండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి సీడం అర్జున్ ఢిల్లీలోని శ్రీ వెంకటేశ్వర కళాశాలలో బీఎస్సీ (ఆనర్స్) ఫిజిక్స్ కోర్సులో ప్రవేశం పొందిన సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి విద్యాభ్యాసానికి తోడ్పాటుగా రూ.50 వేల ఆర్థిక సహాయం చెక్కును కలెక్టర్ అందజేశారు. అర్జున్ సాధించిన విజయాన్ని అభినందించిన కలెక్టర్, గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల విద్యార్థులు కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకోవడం అభినందనీయమన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని మరింత కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆర్థిక సమస్యల కారణంగా చదువులకు దూరం కాకుండా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వివిధ స్థాయిల్లో సహకారం అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం ద్వారా మరింత మంది యువతకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ఇటువంటి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీడం అర్జున్ మాట్లాడుతూ, తన ఉన్నత విద్యాభ్యాసానికి సహాయం అందించిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ పరిస్థితులు సాధారణంగా ఉన్నప్పటికీ చదువుపై ఆసక్తితో కృషి చేసి ఢిల్లీలో సీటు సాధించానని, భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబర్చి జిల్లా పేరు నిలబెట్టేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏవో వర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. విద్యార్థి కుటుంబ సభ్యులు కూడా హాజరై జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. విద్య ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

# భూ సంబంధ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం

**గద్వాల, సెప్టెంబర్ 25 :**



భూ సంబంధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి వెబ్‌ఎక్స్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్షించారు. భూభారతి, రీ సర్వే, సాదా బైనామా, భూ వివాదాల పరిష్కారం తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. భూభారతి, సాదా బైనామా, ఇతర భూ సంబంధిత దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తిరస్కరించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన కారణాలను తెలియజేస్తూ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 28న వనపర్తిలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి రెవెన్యూ సమీక్ష సమావేశానికి సంబంధించి కూడా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆ సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో జిల్లాకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేయాలని తెలిపారు. భూ సమస్యలు, పెండింగ్ దరఖాస్తులు, రీ సర్వే పురోగతి, భూభారతి అమలు వంటి అంశాలపై పూర్తి వివరాలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు. జిల్లాలో చేపడుతున్న చర్యలను సమగ్రంగా వివరించేలా నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. రీ సర్వే పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు తొమ్మిది గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ కేవలం రెండు గ్రామాల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్దిష్ట కాలవ్యవధిలో పనులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. భూముల సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల నవీకరణ వంటి అంశాల్లో రీ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

నేటి ఈవార్తలు



# ఆధ్యాత్మిక శోభ మధ్య గణేష్ శోభాయాత్ర ప్రారంభం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 :**

హిందూ సమాజ్ ఉత్సవ సమితి, ఎదులాపురం ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన సార్వజనిక శోభాయాత్ర శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శ్రీ సరస్వతి శిశు మందిర్, వినాయక్ చౌక్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తుల హర్షధ్వానాల మధ్య ప్రారంభమైంది. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై శోభాయాత్రలో పాల్గొన్నారు. వినాయక నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యుడు గోడం నగేష్, శాసనసభ్యుడు పాయల్ శంకర్, మున్సిపల్ చైర్మన్ బండారి అనుష, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, వార్డు కౌన్సిలర్ ఆకుల రేవతి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి శోభాయాత్ర కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులను అభినందించి వినాయక ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడికి ముఖ్య అతిథులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు.





అనంతరం గణేష్ శోభాయాత్రకు ముఖ్య అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. శోభాయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిగీతాలు, నినాదాలతో ముందుకు సాగారు. వివిధ వినాయక మండపాల ప్రతినిధులు తమ తమ విగ్రహాలతో శోభాయాత్రలో పాల్గొనడంతో పట్టణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. సంప్రదాయ కళారూపాలు, వాద్యబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తుల ఉత్సాహంతో ప్రధాన వీధులు సందడిగా మారాయి. వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. శోభాయాత్ర మార్గంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్యం, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు లచ్చన్న, ప్రవీణ్, పట్టణ ప్రముఖులు, వివిధ వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక ఉత్సాహం, భక్తి భావనల నడుమ ప్రారంభమైన ఈ శోభాయాత్ర పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేష్ నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# భాషల వైవిధ్యమే సంస్కృతుల సంపద

**బ్రస్సెల్స్, సెప్టెంబర్ 25 :**

ప్రపంచంలోని వివిధ భాషల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, భాషల అభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 26న యూరోపియన్ భాషల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. భాష అనేది కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదు. ఒక జాతి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ఆలోచనా విధానాలను ప్రతిబింబించే విలువైన వారసత్వం. భాషల ద్వారా మనుషులు పరస్పరం అనుసంధానమవుతారు. జ్ఞానం, విజ్ఞానం, అనుభవాలను తరతరాలకు అందించడంలో భాషలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా భాషల పరిరక్షణకు, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం పెరుగుతోంది. ప్రపంచంలో వేలాది భాషలు మాట్లాడబడుతున్నప్పటికీ వాటిలో అనేక భాషలు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఆధునికీకరణ, పట్టణీకరణ, ప్రపంచీకరణ ప్రభావంతో కొన్ని ప్రధాన భాషల వినియోగం పెరుగుతుండగా చిన్న భాషలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఒక భాష అంతరించిపోవడం అంటే కేవలం కొన్ని పదాలు మాయమవడం కాదు. ఆ భాషకు సంబంధించిన చరిత్ర, సాహిత్యం, జానపద సంపద, సంస్కృతి, జీవన విధానం



కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే ప్రతి భాషను పరిరక్షించడం ప్రపంచ సమాజం బాధ్యతగా మారింది. భాషల అభ్యాసం వ్యక్తిగత అభివృద్ధికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కొత్త భాషలను నేర్చుకోవడం ద్వారా ఇతర దేశాల సంస్కృతులు, సంప్రదాయాలు, ఆలోచనా విధానాలను అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. విద్య, ఉపాధి, వ్యాపారం, పరిశోధన వంటి రంగాల్లో కూడా బహుభాషా నైపుణ్యం ప్రత్యేక ప్రయోజనాలను అందిస్తుంది. ఒకటి కంటే ఎక్కువ భాషలను తెలిసిన వ్యక్తులు ప్రపంచవ్యాప్తంగా విస్తృత అవకాశాలను పొందగలుగుతున్నారు. అందువల్ల భాషల అభ్యాసం ఆధునిక ప్రపంచంలో ఒక ముఖ్యమైన నైపుణ్యంగా మారింది. సాంకేతిక విప్లవం కారణంగా ప్రపంచం మరింత దగ్గరవుతోంది. వివిధ దేశాల ప్రజలు పరస్పరం మమేకమవుతున్న ఈ కాలంలో భాషల ప్రాముఖ్యత మరింత పెరిగింది. అంతర్జాతీయ వ్యాపారాలు, విద్యా కార్యక్రమాలు, సాంకేతిక రంగ అభివృద్ధి వంటి అంశాల్లో భాషా నైపుణ్యం కీలక పాత్ర పోషిస్తోంది. అనువాద సాంకేతికతలు అభివృద్ధి చెందినప్పటికీ మానవ సంభాషణలో భాషల ప్రత్యేకతకు ప్రత్యామ్నాయం లేదని నిపుణులు చెబుతున్నారు. భాషా వైవిధ్యం సమాజంలో పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తుంది. భిన్న భాషలు మాట్లాడే ప్రజలు ఒకరినొకరు అర్థం చేసుకోవడం ద్వారా సామరస్యం, సహనం, పరస్పర అవగాహన బలపడతాయి. భాషల అధ్యయనం ద్వారా వివక్ష, అపోహలు తగ్గి స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడతాయి.

# మంత్రి పొంగులేటి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**జనగామ, సెప్టెంబర్ 25 :**

రాష్ట్ర గృహ నిర్మాణం, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ నెల 26న జనగామ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝఅ, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి బాధ్యతను క్షుణ్ణంగా నిర్వర్తించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. మంత్రి పర్యటనలో భాగంగా జనగామ మున్సిపాలిటీ పరిధిలో 16 నూతన చెత్త సేకరణ ఆటోలను ప్రారంభించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. అలాగే మున్సిపల్ డంపింగ్ యార్డ్ షెడ్, మురుగు నీటి శుద్ధి కేంద్రం, తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 174 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంతో పాటు 500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కూడా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రజా సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు. ప్రెస్టన్ కళాశాల మైదానం, మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో నిర్వహించనున్న కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేదిక నిర్మాణం, పందిళ్లు, ధ్వని వ్యవస్థ, ఎల్ఈడీ తెరలు, విద్యుత్ సరఫరా, జనరేటర్ సదుపాయం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, మీడియా కేంద్రం, సహాయ కేంద్రం, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం ప్రత్యేక సీటింగ్ బ్లాకులు, కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా లబ్ధిదారులను టోకెన్ల ఆధారంగా తీసుకువచ్చి క్రమబద్ధంగా పంపిణీ కార్యక్రమం



నిర్వహించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. మొత్తం కార్యక్రమ సమన్వయం, ప్రోటోకాల్ ఏర్పాట్లను ఆర్డీవో పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

మున్సిపల్ కార్యాలయం, సభా ప్రాంగణం పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, పరిశుభ్రత చర్యలను మున్సిపల్ అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ బ్యాకప్, లైటింగ్ ఏర్పాట్లను విద్యుత్ శాఖ అధికారులు సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ప్రజా సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక మార్గ మళ్లింపులు అమలు చేయనున్నట్లు తెలిపారు. వీఐపీలు, అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రజల కోసం వేర్వేరు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సభా ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ప్రత్యేకంగా గుర్తించనున్నట్లు చెప్పారు. జనసందోహ నియంత్రణ కోసం తగిన సంఖ్యలో పోలీసు సిబ్బందిని మోహరిస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులు స్పష్టం చేశారు.






# కుటుంబ నియంత్రణతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం

**డెస్క్, సెప్టెంబర్ 25 :**

ప్రపంచ గర్భనిరోధక అవగాహన దినాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 26న నిర్వహిస్తారు. కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి ఆరోగ్యం, బాధ్యతాయుత తల్లిదండ్రత్వం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ దినం ప్రధాన ఉద్దేశం. ఆధునిక సమాజంలో ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థ నిర్మాణానికి సరైన ప్రణాళిక అవసరం. దంపతులు తమ ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితి, కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పిల్లల సంఖ్య, వారి మధ్య విరామం వంటి అంశాలపై సరైన నిర్ణయాలు తీసుకునేలా అవగాహన కల్పించడం ఈ దినోత్సవం లక్ష్యం. కుటుంబ నియంత్రణ అనేది కేవలం జనాభా నియంత్రణకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఇది తల్లి ఆరోగ్యం, శిశు సంక్షేమం, కుటుంబ ఆర్థిక స్థిరత్వం, సమాజ అభివృద్ధి వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంటుంది. సరైన విరామం లేకుండా వరుస గర్భధారణలు జరగడం వల్ల తల్లుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే పుట్టిన పిల్లల పెంపకం, పోషణ, విద్య వంటి అంశాలపై కూడా ప్రభావం చూపుతుంది. అందుకే వైద్య నిపుణులు పిల్లల జననాల మధ్య తగిన విరామం ఉండాలని సూచిస్తుంటారు. ఆరోగ్యకరమైన కుటుంబ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకం. అయితే కుటుంబ నియంత్రణ బాధ్యతను కేవలం మహిళలపైనే మోపకుండా దంపతులు ఇద్దరూ సమాన బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కుటుంబ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాల్లో పరస్పర అవగాహన, పరస్పర గౌరవం, ఆరోగ్య నిపుణుల సలహాలు కీలకంగా మారుతున్నాయి. ఈ దిశగా ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సరైన సమాచారాన్ని అందిస్తున్నాయి. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇప్పటికీ కుటుంబ నియంత్రణపై అపోహలు, తప్పుడు ప్రచారాలు కనిపిస్తున్నాయి. సరైన సమాచారం లేకపోవడం వల్ల అనేక మంది అవసరమైన ఆరోగ్య సేవలను వినియోగించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం కారణంగా తల్లి, శిశు మరణాల సమస్యలు కొనసాగుతున్నాయని ఆరోగ్య రంగ నిపుణులు పేర్కొంటున్నారు.



# తడి బట్టలు వేసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లు వస్తాయా?

**డెస్క్, సెప్టెంబర్ 24 :**

వర్షంలో తడవడం, చెమటతో బట్టలు తడవడం లేదా పూర్తిగా ఆరని దుస్తులు ధరించడం చాలామందిలో కనిపించే సాధారణ పరిస్థితి. అయితే తడి బట్టలను ఎక్కువసేపు ధరించడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తడి వాతావరణంలో చర్మం ఎక్కువసేపు ఉండటం వల్ల ఫంగస్, బ్యాక్టీరియా పెరగడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడవచ్చు. ముఖ్యంగా గజ్జలు, చర్మ దురద, ఎర్రబడటం వంటి సమస్యలు కొందరిలో కనిపించవచ్చు. శరీరంలోని మడతలు ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్యలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. వ్యాయామం చేసిన తర్వాత లేదా వర్షంలో తడిసిన తర్వాత తడి దుస్తులను వెంటనే మార్చుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పూర్తిగా ఆరని బట్టలను ధరించడం కూడా నివారించాలని చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు మరియు ఇప్పటికే చర్మ సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. పరిశుభ్రమైన, పొడి దుస్తులు ధరించడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.



# కరివేపాకు పొడి.. ప్రతి వంటింటిలో ఘుమఘుమల రుచి

**డెస్క్, సెప్టెంబర్ 25 :**

కరివేపాకు పొడి ప్రస్తుతం అనేక కుటుంబాల్లో ఇష్టంగా వినియోగించే ఆహార పదార్థాల్లో ఒకటిగా నిలుస్తోంది. కరివేపాకు ఆకుల సువాసన, ఇతర మసాలాల రుచి కలయికతో తయారయ్యే ఈ పొడి భోజనానికి ప్రత్యేక రుచిని అందిస్తుంది. తక్కువ సమయంలో రుచికరమైన ఆహారం సిద్ధం చేసుకోవాలనుకునే వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. కరివేపాకు ఆకులను శుభ్రంగా కడిగి ఎండబెట్టి, వాటితో పాటు మినపప్పు, శనగపప్పు, ఎండుమిర్చి, జీలకర్ర వంటి పదార్థాలను వేయించి పొడిచేస్తారు. ఇలా తయారైన పొడి ఘుమఘుమల సువాసనతో ఆకలి పెంచేలా ఉంటుంది. ప్రతి ఇంటి రుచికి అనుగుణంగా పదార్థాల మోతాదుల్లో మార్పులు కూడా చేస్తుంటారు. వేడి అన్నంలో కొద్దిగా నెయ్యి లేదా నూనె వేసి కరివేపాకు పొడి కలిపి తింటే ఎంతో రుచిగా ఉంటుందని ఆహార ప్రియులు చెబుతున్నారు.



# గుమ్మడి గింజలు.. చిన్నవైనా పోషకాల ఖజానా

**డెస్క్, సెప్టెంబర్ 21 :**

గుమ్మడి గింజలు ఇటీవలి కాలంలో ఆరోగ్యకర ఆహారంగా విస్తృత గుర్తింపు పొందుతున్నాయి. ఒకప్పుడు గుమ్మడికాయ నుంచి గింజలను వేరు చేసి పారవేసే వారు ఎక్కువగా ఉండేవారు. అయితే ప్రస్తుతం వాటిలో ఉన్న పోషక విలువలపై అవగాహన పెరగడంతో గుమ్మడి గింజలను ప్రత్యేకంగా ఆహారంలో చేర్చుకుంటున్నారు. చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ శరీరానికి అవసరమైన అనేక పోషకాలు వీటిలో లభిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. గుమ్మడి గింజల్లో ప్రోటీన్లు, పీచు పదార్థం, ఆరోగ్యకర కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. అదనంగా మెగ్నీషియం, జింక్, ఐరన్, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు కూడా లభిస్తాయి. ఇవి శరీరంలోని వివిధ జీవక్రియలకు అవసరమైన పోషకాలుగా గుర్తించబడ్డాయి. అందువల్ల సమతుల్య ఆహారంలో భాగంగా గుమ్మడి గింజలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యంపై శ్రద్ధ చూపే వారిలో కూడా గుమ్మడి గింజలకు ఆదరణ పెరుగుతోంది.

# మళ్లీ స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :**

అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిణామాల ప్రభావంతో ఇటీవల బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. గురువారం తగ్గిన బంగారం ధరలు శుక్రవారం స్వల్పంగా పెరిగాయి. గుడ్‌రిటర్న్స్ ప్రకారం ఉదయం 10 గంటలకు ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.160 పెరిగి రూ.1,52,990కు చేరింది. 22 క్యారెట్ల ధర రూ.150 పెరిగి రూ.1,40,250గా నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,840గా ఉంది. 22 క్యారెట్ల ధర రూ.1,40,100 కాగా.. 18 క్యారెట్ల బంగారం రూ.1,14,630గా నమోదైంది. తెలంగాణలో హైదరా బాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయ



వాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో 24 క్యారెట్ల బంగారం రూ.1,52,840, 22 క్యారెట్ల ధర రూ.1,40,100, 18 క్యారెట్ల ధర రూ.1,14,630గా ఉంది. వెండి ధర ఢిల్లీలో కిలోకు రూ.2,45,000గా ఉండగా.. తెలుగు రాష్ట్రాల్లో కిలో వెండి రూ.2,50,000 వద్ద కొనసాగుతోంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు కనిపించాయి. ముంబై, కేరళలో 24 క్యారెట్ల బంగారం రూ.1,52,840గా ఉండగా.. అహ్మదాబాద్‌లో రూ.1,52,890, అయోధ్యలో రూ.1,52,990గా ఉంది. నగరాన్ని బట్టి 22, 18 క్యారెట్ల ధరల్లోనూ స్వల్ప తేడాలు నమోదయ్యాయి.

# 20 వేల మందికి ఉద్యోగాలు.. ఫోన్‌పే భారీ విస్తరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 :**

డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే దేశవ్యాప్తంగా తన వ్యాపారుల నెట్‌వర్క్‌ను మరింత విస్తరించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాలను పెంచాలని సంస్థ నిర్ణయించింది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది కాలంలో 20 వేలకు పైగా ఫ్రంట్‌లైన్ విక్రయ సిబ్బందిని నియమించుకోనున్నట్లు వెల్లడించింది. దేశంలోని మరిన్ని ప్రాంతాల్లో వ్యాపారులను డిజిటల్ చెల్లింపుల వ్యవస్థతో అనుసంధానించడంతో పాటు.. వారికి అవసరమైన చెల్లింపు పరికరాలను అందుబాటులోకి తీసుకురావడంపై ఫోన్‌పే దృష్టి సారించింది. ఈ క్రమంలో వచ్చే 12 నెల్లో 50 లక్షలకు పైగా చెల్లింపు పరికరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటిలో స్మార్ట్ స్పీకర్లు, పాయింట్ ఆఫ్ సేల్ పరికరాలు తదితరాలు ఉండనున్నాయి. ఈ విస్తరణలో గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఫోన్‌పే భావిస్తోంది. ఏర్పాటు చేయనున్న మొత్తం చెల్లింపు పరికరాల్లో దాదాపు 50 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే అందు




బాటులోకి తీసుకురా వాలని యోచిస్తోంది. చిన్న పట్టణాలు, గ్రామాల్లోని దుకాణాలు, వ్యాపార సంస్థలకు డిజిటల్ చెల్లింపుల సదుపాయాలను మరింత చేరువ చేయడం ద్వారా నగదు రహిత లావాదేవీల వినియోగాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టనుంది. కొత్తగా నియమించుకునే ఫ్రంట్‌లైన్ సిబ్బంది ద్వారా వ్యాపారులతో నేరుగా అనుసంధానం పెంచడంతో పాటు చెల్లింపు పరికరాల ఏర్పాటు, సేవల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వనుంది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ మార్కెట్లలోనూ తన వ్యాపారుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకునే దిశగా ఫోన్‌పే ఈ ప్రణాళికను అమలు చేయనుంది.

# హీరో మోటార్స్ షేరుకు జోష్

**ముంబై, సెప్టెంబరు 25 :**

స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టిన మూడు రోజుల్లోనే హీరో మోటార్స్ షేరు భారీ లాభాలను నమోదు చేసింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఈ షేరు వరుసగా రెండో రోజు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో రూ.141.85 వద్ద సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,443.05 కోట్లకు చేరింది. లిస్టింగ్ తర్వాత వరుసగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో షేరు ధర వేగంగా పెరిగింది. హీరో మోటార్స్ షేర్లు సెప్టెంబరు 23న స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యాయి. కంపెనీ ఐపీఓ ఇష్యూ ధరను రూ.84గా నిర్ణయించింది. అయితే లిస్టింగ్ సమయంలో ఎన్ఎస్ఈలో రూ.82 వద్ద, బీఎస్ఈలో రూ.82.10 వద్ద షేర్లు నమోదయ్యాయి. దీంతో ఇష్యూ ధరతో పోలిస్తే ఎన్ఎస్ఈలో 2.38 శాతం డిస్కౌంట్‌తో షేరు మార్కెట్లోకి వచ్చింది. లిస్టింగ్ రోజున డిస్కౌంట్ ఎదురైనప్పటికీ.. ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. లిస్టింగ్ అనంతరం షేరులో కొనుగోళ్ల మద్దతు క్రమంగా పెరిగింది. దీంతో షేరు ధర వరుస సెషన్లలో గణనీయంగా పెరిగింది. లిస్టింగ్ ధరతో పోలిస్తే ఇప్పటివరకు దాదాపు 73 శాతం వృద్ధి నమోదైంది. శుక్రవారం మరోసారి 20 శాతం అప్పర్ సర్క్యూట్ తాకడంతో ఇన్వెస్టర్ల దృష్టి ఈ షేరుపై పడింది. బీఎస్ఈలో




రూ.141.85 స్థాయికి చేరడం ద్వారా కొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఐపీఓకు మంచి స్పందన హీరో మోటార్స్ ఐపీఓ సెప్టెంబరు 16 నుంచి 18 వరకు కొనసాగింది. ఈ ఐపీఓకు మొత్తం 6.66 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,000 కోట్లను సమీకరించింది. ఇందులో రూ.600 కోట్ల విలువైన 7.14 కోట్ల తాజా షేర్లను జారీ చేసింది. మరో రూ.400 కోట్ల విలువైన 4.76 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయించింది. కంపెనీ వ్యాపార కార్యకలాపాలను పరిశీలిస్తే.. అమెరికా, యూరప్, భారత్, ఆసియాన్ దేశాల్లోని ఆటోమొబైల్ తయారీ సంస్థలకు అవసరమైన పవర్‌ట్రెయిన్ సొల్యూషన్స్‌ను హీరో మోటార్స్ అందిస్తోంది. వాహనాల ఇంజిన్, డ్రైవ్ వ్యవస్థలకు అవసరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులను కంపెనీ అందిస్తోంది. పలు అంతర్జాతీయ మార్కెట్లలో ఆటోమొబైల్ పరిశ్రమతో అనుసంధానమై వ్యాపారాన్ని కొనసాగిస్తోంది. ఆర్థిక ఫలితాల్లోనూ వృద్ధి కంపెనీ ఆర్థిక పనితీరులోనూ వృద్ధి నమోదైంది. 2023-24 నుంచి 2025-26 మధ్య కాలంలో సంస్థ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.7 శాతం వృద్ధి చెందింది.

# యూపీఐ ఛార్జీలపై కేంద్రం స్పష్టత..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 :**

యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)కు సంబంధించి వినియోగదారుల్లో నెలకొన్న సందేహాలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. కొత్త ఎండీఆర్ విధానం కస్టమర్లపై అదనపు భారాన్ని మోపదని కేంద్రం పేర్కొంది. నిర్దిష్ట పెద్ద మొత్తాల వ్యాపార లావాదేవీలకు మాత్రమే ఎండీఆర్ వర్తిస్తుందని, ఈ రుసుము వ్యాపారులు-చెల్లింపుల వ్యవస్థలోని సంబంధిత భాగస్వాముల మధ్యే ఉంటుందని స్పష్టం చేసింది.

### అక్టోబరు 15 నుంచి కొత్త నిబంధనలు

కొత్త విధానం ప్రకారం అక్టోబరు 15, 2026 నుంచి రూ.2,000కు మించిన కొన్ని పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తించనుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు ఎండీఆర్ గరిష్ఠంగా ఒక్కో లావాదేవీకి రూ.300కు పరిమితం చేశారు. అయితే వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే పర్సన్-టు-పర్సన్ (పీ2పీ) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఎండీఆర్ ఉండదు. రూ.2,000 వరకు జరిగే వ్యాపారి లావాదేవీలు కూడా ఎండీఆర్ నుంచి మినహాయింపు పొందుతాయి. అలాగే చిన్న వ్యాపారులకు వర్తిస్తున్న జీరో-ఎండీఆర్ విధానం కొనసాగనుంది. నెలకు యూపీఐ ద్వారా రూ.1 లక్ష వరకు స్వీకరించే చిన్న వ్యాపా




రులు, వీధి వ్యాపారులు, స్థానిక దుకాణాలు తదితరులకు కూడా రక్షణ కల్పించినట్లు కేంద్రం తెలిపింది. దీంతో మొత్తం పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో సుమారు 96 శాతం ఎండీఆర్ ప్రభావానికి లోనుకావని ప్రభుత్వం వెల్లడించింది. కస్టమర్ల నుంచి అదనంగా వసూలు చేయరాదు ఎండీఆర్ అనేది కస్టమర్‌పై విధించే ఛార్జీ కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఉదాహరణకు ఒక వినియోగదారు వ్యాపారికి రూ.5,000ను యూపీఐ ద్వారా చెల్లించినప్పుడు.. ఎండీఆర్ పేరుతో కస్టమర్ నుంచి అదనంగా రుసుము వసూలు చేయడం కొత్త విధానంలో భాగం కాదు. ఎండీఆర్ వ్యాపారి చెల్లింపు వ్యవస్థలోనే వర్తిస్తుంది.

### ఎండీఆర్ అంటే ఏమిటి?

మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అనేది వ్యాపారి నుంచి స్వీకరించే డిజిటల్ చెల్లింపును ప్రాసెస్ చేసే సమయంలో చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వాముల మధ్య వర్తించే రుసుము.




# లిస్టింగ్ రోజే రికార్డులు.. ఎన్ఎస్ఈ షేరు జోరు

**ముంబై, సెప్టెంబరు 25 :**

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) షేర్లు లిస్టింగ్ రోజే మంచి లాభాలతో ముగిశాయి. ఐపీఓ ధర రూ.1,785తో పోలిస్తే 0.84 శాతం ప్రీమియంతో రూ.1,800 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైన షేరు.. తొలి గంటలోనే 5.21 శాతం ఎగబాకి రూ.1,878 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత లాభాలు క్రమంగా తగ్గడంతో తొలిరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈ షేరు 1.85 శాతం లాభంతో రూ.1,818 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.4.50 లక్షల కోట్లకు చేరింది. మార్కెట్ విలువ పరంగా ఎన్ఎస్ఈ ప్రపంచంలో ఏడో అత్యంత విలువైన స్టాక్ ఎక్స్ఛేంజీగా, ఆసియాలో రెండో అత్యంత విలువైన ఎక్స్ఛేంజీగా నిలిచింది. దేశంలోని అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీల్లో 11వ స్థానాన్ని దక్కించుకుంది. ఇంట్రాడేలో టాప్-10లోకి చేరినప్పటికీ.. ముగింపు సమయానికి ఆ స్థాయిని కొనసాగించలేకపోయింది. ప్రత్యర్థి బీఎస్ఈ మార్కెట్ విలువ రూ.1.29 లక్షల కోట్లుగా ఉండగా.. దానితో పోలిస్తే ఎన్ఎస్ఈ విలువ దాదాపు మూడింతలు ఎక్కువగా నమోదైంది. సెబీ నిబంధనల ప్రకారం ఐపీఓ అనంతరం ఎన్ఎస్ఈ షేర్లు బీఎస్ఈలో లిస్టయ్యాయి.




# స్మార్ట్‌ఫోన్ రంగంలోకి మివీ.. వన్ 5జీ విడుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :**

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కన్స్యూమర్ టెక్నాలజీ బ్రాండ్ మివీ తాజాగా స్మార్ట్‌ఫోన్ విభాగంలోకి అడుగుపెట్టింది. 'మివీ వన్ 5జీ' పేరుతో తన తొలి స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. ఇప్పటివరకు ఆడియో, ఇతర వినియోగదారు సాంకేతిక ఉత్పత్తులతో గుర్తింపు తెచ్చుకున్న సంస్థ.. తాజాగా మొబైల్ ఫోన్ విభాగంలోనూ తన ఉనికిని విస్తరించింది. 'మివీ వన్ 5జీ'ని 128 జీబీ నిల్వ సామర్థ్యంతో మూడు ర్యామ్ వేరియంట్లలో అందుబాటులోకి తీసుకొచ్చింది. 4 జీబీ, 6 జీబీ, 8 జీబీ ర్యామ్ ఎంపికలు ఉన్నాయి. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వేర్వేరు ధరల శ్రేణుల్లో ఈ మూడు వేరియంట్లను తీసుకొచ్చినట్లు కంపెనీ పేర్కొంది. స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో అందుబాటు ధరలో 5జీ ఫోన్‌ను అందించడంపై మివీ దృష్టి సారించింది. ఈ ఫోన్‌లో స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 2 మొబైల్ వేదికను ఉపయోగించారు. దీంతో రోజువారీ వినియోగం, సామాజిక మాధ్యమాలు, వీడియోలు, ఆన్‌లైన్ సేవలు, ఇతర సాధారణ పనులను నిర్వహించేందుకు అనువుగా ఉంటుందని కంపెనీ తెలిపింది.




# ఎస్‌బీఐ కొత్త క్రెడిట్ కార్డు

**ముంబై, సెప్టెంబరు 25 :**

పండుగ సీజన్ నేపథ్యంలో ఎస్‌బీఐ కార్డ్ కొత్త సెక్యూర్డ్ క్రెడిట్ కార్డును అందుబాటులోకి తీసుకొచ్చింది. 'అడ్వాంటేజ్ ఎస్‌బీఐ కార్డ్' పేరుతో తీసుకొచ్చిన ఈ కార్డుకు ఫిక్స్‌డ్ డిపాజిట్ భద్రతగా ఉంటుంది. ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ నిర్వహిస్తున్న అర్హత కలిగిన కస్టమర్లు ఈ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేకత ఏమిటంటే.. భౌతిక పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండా ఎస్‌బీఐ యోనో వేదిక ద్వారా పూర్తిగా డిజిటల్ విధానంలో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. కార్డు కోసం దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసినట్లు ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది. యోనో వేదికలో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేయవచ్చని, ఇందుకు సుమారు 10 నిమిషాల సమయం పడుతుందని పేర్కొంది. సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులో కస్టమర్ నిర్వహిస్తున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ రుణ సౌకర్యానికి భద్రతగా పనిచేస్తుంది. దీంతో సాధారణ క్రెడిట్ కార్డుకు అర్హత సాధించలేని లేదా తమ క్రెడిట్ చరిత్రను నిర్మించుకోవాలని భావించే వారికి ఈ విధానం ఉపయోగపడే అవకాశం ఉంది.

### నాలుగు రకాల కార్డులు

ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు పథకంలో భాగంగా కస్టమర్లు నాలుగు రకాల కార్డుల నుంచి ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఎస్‌బీఐ కార్డ్ ఎలైట్, ఎస్‌బీఐ కార్డ్ ప్రైమ్, సింప్లీక్లిక్ ఎస్‌బీఐ కార్డ్, సింప్లీసేవ్ ఎస్‌బీఐ కార్డ్ వేరియంట్లు ఇందులో ఉన్నాయి. ఎస్‌బీఐ బ్యాంకింగ్ వేదిక ద్వారా నేరుగా ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఆధారిత కార్డులకు దరఖాస్తు చేసుకునే వీలుంటుంది.



# వయసుపై వస్తున్న రూమర్స్‌కు వైష్ణవి చైతన్య చెక్

హైదరాబాద్, సెప్టెంబరు 25 :

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ వైష్ణవి చైతన్య తన వయసుపై వస్తున్న రూమర్స్‌కు చెక్ పెట్టారు. యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె షార్ట్ ఫిలింస్, వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం సినిమాల్లోకి అడుగుపెట్టి 'అల వైకుంఠపురములో', 'రంగ్ దే', 'టక్ జగదీష్', 'వరుడు కావలెను' వంటి చిత్రాల్లో సహాయక పాత్రల్లో నటించారు. 'బేబీ' సినిమాతో హీరోయిన్‌గా అరంగేట్రం చేసిన వైష్ణవి.. ఆ చిత్రంతో ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'లవ్ మీ', 'జాక్' చిత్రాల్లో కథానాయికగా నటించారు. ఇటీవల ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఎపిక్' సినిమాలో కనిపించారు. సెప్టెంబరు 11న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన అందుకుంది. 'ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వైష్ణవిని యాంకర్ ఆమె వయసుపై ప్రశ్నించారు. వికీపీడియాలో తన వయసు 32 ఏళ్లుగా ఉందని, అయినప్పటికీ 25 ఏళ్ల అమ్మాయిలా కనిపిస్తున్నారని.. అందుకు కారణం ఏమిటని అడిగారు.



# కొత్త సినిమా కోసం రిషబ్ శెట్టి ఓపెన్ కాస్టింగ్ కాల్

హైదరాబాద్, సెప్టెంబరు 25 :

'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి కొత్త సినిమా కోసం ఓపెన్ కాస్టింగ్ కాల్ ప్రకటించారు. తన నిర్మాణ సంస్థ రిషబ్ శెట్టి ఫిల్మ్స్ ఆధ్వర్యంలో తెరకెక్కనున్న కొత్త ప్రాజెక్ట్‌లో నటించేందుకు కొత్త ప్రతిభను ఎంపిక చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆడిషన్లు అక్టోబరు 2న బెంగ ళూరులోని విజయా కాలేజీలో నిర్వహించనున్నారు. పురుష లకు 20 నుంచి 65 ఏళు మహిళలకు 20 నుంచి 60 ఏళ్ల వయోపరిమితిని నిర్ణయించారు. నటనపై ఆసక్తి ఉన్నవారు ఈ అవ కాశాన్ని వినియోగించుకోవాలని చిత్రబృం దం సూచిం చింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ జీవిత విశేషాలు, వ్యక్తిగత వివరాలు, గతంలో చేసిన పనులకు సంబం ధించిన వివరాలు లేదా లింకులను ు పంపవచ్చు. విభిన్న పాత్రలకు సరిపోయే కొత్త ముఖాలను ఎంపిక చేయను న్నట్లు రిషబ్ శెట్టి తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా వెల్లడించారు. సినిమా రంగం లోకి అడుగుపెట్టాలని కలలు కంటున్న కొత్త నటీనటులకు ఈ ఆడిషన్స్ మంచి వేదికగా మార నున్నాయి. అర్హతలు, ఎంపిక ప్రక్రియ, ఇతర వివరాల కోసం రిషబ్ శెట్టి అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో వచ్చే సమాచారాన్ని గమనిం చాలని నిర్వాహ కులు సూచించారు.



# 'రంభ ఊర్వశి మేనక' ఓటీటీలోకి వచ్చేసింది

హైదరాబాద్, సెప్టెంబరు 25 :

కామెడీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే అల్లరి నరేష్ మరోసారి వినోదాత్మక కథతో వచ్చిన చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహించిన ఈ సినిమాను రాజేష్ దండా, ప్రసాద్ నిమ్మకాయల సంయుక్తంగా నిర్మించారు. సెప్టెంబరు 4న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల తర్వాత 'రంభ ఊర్వశి మేనక' అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ ప్రారంభించింది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ సినిమాను వీక్షించే అవకాశం కల్పించారు. దీంతో థియేటర్లలో సినిమా చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంటి నుంచే చూసే అవకాశం లభించింది. సామాజిక అంశాలను ఫాంటసీ అంశాలతో మేళవిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించారు. అల్లరి నరేష్ కామెడీ టైమింగ్‌తో పాటు విభిన్నమైన కథలను ఎంచుకునే నటుడిగా గుర్తింపు తెచ్చుకు న్నారు. ఈ సినిమాలోనూ వినోదంతో పాటు ఫాంటసీ అంశాలను జోడించి ప్రేక్షకు లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే థియేట ర్లలో విడుదలైన సమయం లో సినిమాకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని సినీ వర్గాల్లో చర్చ జరిగింది. కథనం, ఫాంటసీ అంశాలు ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకున్నాయన్న దానిపై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ఇప్పుడు ఓటీటీలో అందుబాటులోకి రావ డంతో ఈ సినిమాకు కొత్త ప్రేక్షకుల నుంచి ఎలాంటి ఆదరణ లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో అల్లరి నరేష్‌తో పాటు రాశి సింగ్, ప్రిషా సింగ్, విష్ణుప్రియ, సురభి, వీకే నరేష్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఫాంటసీ, వినోదం, సామాజిక అంశాలను మేళవించిన ఈ సినిమా ఓటీటీ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.




# 'సిగ్మా'లో మంచి ఎమోషనల్ క్యారెక్టర్

హైదరాబాద్, సెప్టెంబరు 25 :

సందీప్ కిషన్ హీరోగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సిగ్మా' చిత్రంలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఫరియా మీడియాతో మాట్లాడారు. 'సిగ్మా'లో తాను రేడియో జాకీ పాత్రలో కనిపిస్తానని ఫరియా తెలిపారు. తన పాత్రలో అన్ని రకాల భావోద్వేగాలను చూపించే అవకాశం లభించిందని చెప్పారు. యాక్షన్, అడ్వెంచర్, కామెడీ అంశాలతో రూపొందిన ఈ చిత్రాన్ని కుటుంబంతో కలిసి హాయిగా చూడొచ్చని పేర్కొన్నారు.సందీప్ కిషన్‌తో కలిసి సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నామని,చివరకు 'సిగ్మా'తో ఆ అవకాశం వచ్చిందని ఫరియా వెల్లడించారు. దర్శకుడు జేసన్ సంజయ్ జూమ్ కాల్‌లో కథ చెప్పారని, కథ విన్న తర్వాత ఆయన వయసు అడిగితే 24 ఏళ్లని చెప్పారని గుర్తుచేసుకున్నారు.

తొలి సినిమా అయినప్పటికీ జేసన్ ఎంతో స్పష్టత, విజన్‌తో చిత్రాన్ని తెరకెక్కించారని ఫరియా ప్రశంసించారు. సూపర్‌స్టార్ విజయ్ కుమారుడనే భావన ఆయనలో ఏమాత్రం కనిపించదని, చాలా వినయంగా, స్నేహపూర్వకంగా ఉంటారని అన్నారు. 'సిగ్మా' లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉ ందని, తమన్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఫరియా పేర్కొన్నారు.



# మధురైలో ధనుష్ 'డి-56' ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబరు 25 :

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'డి-56' మధురైలో పూజా కార్యక్రమాలతో లాంఛ నంగా ప్రారంభమైంది. 'లబ్బర్ పందు' సినిమాతో గుర్తింపు తెచ్చు కున్న యువ దర్శకుడు తమిళరసన్ పచము త్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తు న్నారు. ఈ సినిమాతో ధనుష్ మరో వైవిధ్యమైన పాత్రలో కనిపించ నున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ధనుష్‌కు జోడీగా ప్రీతి ముకుం దన్ నటించ నున్నారు. లెజెండరీ కమెడియన్ వడివేలు, ఎస్.జె. సూర్య, 'ఉరియడి' ఫేమ్ విజయ్ కుమార్ తదిత రులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భిన్న తరాలకు చెందిన నటులు ఒకే సినిమాలో నటిస్తుం డటంతో ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యాంకర్ సంగీతం అంది స్తున్నా రు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రైమ్‌మార్క్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నాయి. మధురైలో ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తవడంతో త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. సినిమాకు సంబం ధించిన కథ, విడుదల తేదీ తదితర వివరాలను చిత్రబృందం త్వరలో వెల్లడించ నుంది. మరోవైపు ధనుష్ నటిం చిన 'ఓం' చిత్రం నవంబర్‌లో థియే టర్లలో విడుదలకు సిద్ధమవు తోంది. ఒకవైపు తన సినిమాల విడుదలకు సన్నద్ధ మవుతూనే.. మరోవైపు కొత్త ప్రాజెక్టులను ప్రారంభిస్తూ ధనుష్ వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతున్నారు.



## మన్‌ప్రీత్ కౌర్‌కు షాట్‌పుట్‌లో కాంస్యం

**నాగోయా, సెప్టెంబరు 25 :**

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ మన్‌ప్రీత్ కౌర్ సత్తా చాటింది. మహిళల షాట్‌పుట్ ఫైనల్లో 17.17 మీటర్ల దూరం ఇనుప గుండును విసిరి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఈ విభాగంలో ఆసియా క్రీడల పతకం సాధించిన మూడో భారత మహిళగా మన్‌ప్రీత్ చరిత్ర సృష్టించింది.

### 17.17 మీటర్లతో పోడియంపై

శుక్రవారం జరిగిన మహిళల షాట్‌పుట్ ఫైనల్లో మన్‌ప్రీత్ ఆరంభం నుంచే నిలకడగా ప్రదర్శన ఇచ్చింది. కీలక ప్రయత్నంలో 17.17 మీటర్ల దూరం విసరడంతో మూడో స్థానంలో నిలిచి కాంస్యాన్ని ఖాయం చేసుకుంది. అంతకుముందు బర్బరా వెబ్‌స్టర్ 1951లో, కిరణ్ బలియాన్ 2023లో ఈ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. తాజాగా వారి సరసన మన్‌ప్రీత్ చేరింది.




## సాత్విక్-చిరాగ్‌కు షాక్.. మానుష్-దియా పతకం ఖాయం

**నాగోయా, సెప్టెంబరు 25 :**

ఆసియా క్రీడల్లో ఆరో రోజు భారత బృందానికి మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ తొలి రౌండ్‌లోనే అనూహ్యంగా నిష్క్రమించారు. మరోవైపు టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో మానుష్ షా-దియా చిటాలే జోడీ సెమీఫైనల్‌కు చేరి భారత్‌కు పతకం ఖాయం చేసింది.

### తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ ఔట్

పురుషుల డబుల్స్‌లో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన సాత్విక్-చిరాగ్ జోడీ థాయ్‌లాండ్‌కు చెందిన పక్కపోన్ తీరరత్నకుల్-పీరట్చాయ్ సుఖ్‌ఫున్ జంటతో తలపడింది. తొలి గేమ్‌ను 21-12తో గెలిచిన భారత జోడీ ఆ తర్వాత తడబడింది. థాయ్ జంట 21-19, 21-14తో వరుసగా రెండు గేమ్‌లు గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. దీంతో గత ఆసియా క్రీడల్లో సాధించిన స్వర్ణాన్ని నిలబెట్టుకోవాలన్న సాత్విక్-చిరాగ్ ప్రయత్నం తొలి రౌండ్‌లోనే ముగిసింది.

### మానుష్-దియాకు పతకం ఖాయం

టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో మానుష్ షా-దియా చిటాలే అద్భుత ప్రదర్శన చేశారు. క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంక్ హాంకాంగ్ జోడీ వాంగ్ చున్ టింగ్-డూ హోయ్ కెమ్‌ను 3-1తో ఓడించి సెమీఫైనల్‌కు చేరారు. 11-6, 13-15, 11-9, 11-5తో విజయం సాధించిన భారత జోడీకి కనీసం కాంస్య పతకం ఖాయమైంది.

సెమీఫైనల్లో మానుష్-దియా చిటాలే జోడీ చైనాకు చెందిన వాంగ్ చుకిన్-సున్ యింగ్‌షా జంటతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే భారత జోడీ ఫైనల్‌కు చేరి రజతం ఖాయం చేసుకుంటుంది. ఓటమి ఎదురైనా కాంస్య పతకం భారత్ ఖాతాలో చేరుతుంది.

### ప్రీతి పవార్‌పై ఉత్కంఠ

మహిళల 54 కిలోల బాక్సింగ్ విభాగంలో ప్రీతి పవార్ నార్త్ కొరియాకు చెందిన పాంగ్ చోయ్ మితో రౌండ్ ఆఫ్ 16లో తలపడాల్సి ఉంది. గతంలో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన ప్రీతి ఈ పోటీలో పతకంపై ఆశలు పెంచుకుంది.

రెండో రౌండ్‌కు దూసుకెళ్లిన భారత జంట



# పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ శుభారంభం

### ఆసియా క్రీడల మహిళల డబుల్స్‌లో హాంకాంగ్ జోడీపై 2--1 విజయం

ఐచి--నగోయా ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ వ్యక్తిగత విభాగంలో భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ--పుల్లెల గాయత్రి గోపీచంద్ శుభారంభం చేసింది. సెప్టెంబరు 25న జరిగిన తొలి రౌండ్ పోరులో హాంకాంగ్‌కు చెందిన లుయి లోక్ లోక్--ట్సాంగ్ హియు యాన్ జోడీపై భారత జంట 21--16, 16--21, 21--16తో విజయం సాధించింది. దీంతో ట్రీసా--గాయత్రి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి గేమ్‌లోనే భారత జంట దూకుడు ప్రదర్శించి 21--16తో ఆధిక్యం సాధించింది. రెండో గేమ్‌లో హాంకాంగ్ జంట పుంజుకుని 21--16తో సమం చేసింది. దీంతో నిర్ణాయక మూడో గేమ్ ఉత్కంఠగా సాగింది. కీలక దశలో ట్రీసా--గాయత్రి ఒత్తిడిని అధిగమించి 21--16తో గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు.

క్రీడా ప్రతినిధి, సెప్టెంబర్ 26:ఇటీవల ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించి మంచి ఊపుమీదున్న ట్రీసా--గాయత్రి జోడీపై ఆసియా క్రీడల్లోనూ అంచనాలు ఉన్నాయి. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో చైనా టాప్ సీడ్ జోడీపై క్వార్టర్‌ఫైనల్ విజయం ద్వారా భారత్‌కు మహిళల డబుల్స్‌లో చారిత్రక పతకాన్ని ఖాయం చేసిన ఈ జంట, సెమీఫైనల్‌లో ఓడినా కాంస్య పతకంతో టోర్నీని ముగించింది. ఆసియా క్రీడల టీమ్ ఈవెంట్‌లోనూ ట్రీసా--గాయత్రి కీలకంగా రాణించారు. జపాన్‌తో జరిగిన మహిళల టీమ్ క్వార్టర్‌ఫైనల్లో యుకీ ఫుకుషిమా--మయూ మత్సుమోటో జోడీని 21--17, 21--16తో ఓడించి భారత్‌కు ఏకైక విజయం అందించారు. ఇక వ్యక్తిగత విభాగంలో తొలి విజయాన్ని నమోదు చేసిన ట్రీసా జాలీ--పుల్లెల గాయత్రి జోడీ తదుపరి రౌండ్‌లోనూ ఇదే జోరును కొనసాగించేందుకు సిద్ధమవుతోంది.

## రాష్ట్ర త్రోబాల్ జట్ల ఎంపికకు ట్రయల్స్

### పురుషులు, మహిళల విభాగాల్లో ప్రతిభావంతులకు అవకాశం

క్రీడా ప్రతినిధి, హైదరాబాద్ సెప్టెంబర్ 26: తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి త్రోబాల్ జట్ల ఎంపికకు ట్రయల్స్ నిర్వహించనున్నట్లు మన్నే అవినాష్ తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులకు ఈ ఎంపికల్లో అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. సెప్టెంబరు 27న సైనిక్‌పురిలోని భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని త్రోబాల్ కోర్టులో ఎంపిక ట్రయల్స్ నిర్వహించనున్నట్లు మన్నే అవినాష్ తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించాలనుకునే ప్రతిభావంతులైన పురుష, మహిళా త్రోబాల్ క్రీడాకారులు ఈ ట్రయల్స్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. ఎంపిక ప్రక్రియలో క్రీడాకారుల ఆటతీరు, ప్రతిభను పరిశీలించి రాష్ట్ర జట్లకు ఎంపిక చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సెప్టెంబరు 27న ఉదయం 8 గంటలకు సైనిక్‌పురిలోని భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ త్రోబాల్ కోర్టుకు ఆసక్తిగల క్రీడాకారులు హాజరుకావాలని మన్నే అవినాష్ సూచించారు. పురుషులు, మహిళలు రెండు విభాగాల్లోనూ ఎంపికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ట్రయల్స్‌కు సంబంధించిన ఇతర వివరాల కోసం మన్నే అవినాష్ -- 9000623761, దినేష్ కుమార్ -- 9848756168 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.